# జనపథం - జనపదం

## (జనులు నడిచే బాట - జనులు నుడివే మాట)

## చతుర్విధభక్తి

అదేమిటి? నవవిధభక్తి కదా మనము విన్నది. ఈ చతుర్విధభక్తి ఏమిటి? అనుకుంటున్నారా? నవవిధభక్తి కృతయుగ వర్గీకరణ. ఈ కలి యుగములోనీ అదే వర్గీకరణ అంత బాగుండదు. ఆ యుగములో మోక్షసాధనకే నవవిధభక్తి. నేటి యుగములో బ్రతికి బట్టకట్టడానికి ఈ చతుర్విధభక్తి. ఇక విషయానికి వస్తే, ఈ వర్గీకరణ చాలా సులభం.

1. నిస్వార్థభక్తి : ఈ కాలములో ఇది అరుదు. నవవిధభక్తి ప్రక్రియలు ఈ కోవలోకి వస్తాయి. జనం దృష్టిలో ఈ భక్తిని అనుసరించే వారు లౌక్యం తెలియని వాళ్ళు. పిచ్చివాళ్ళు. అజ్ఞానులు. వీరికి ఇవ్వడమే ప్రధానం. నిష్కామకర్మ వీరి మార్గము. సాటి ప్రాణులు ఏవైనా వీరికి ప్రేమ. ఎదుటి వారిలో దైవాన్ని చూడగల దైవస్వరూపులు. 'అహం బ్రహ్మాస్మి' అనేది (అనుభవపూర్వకముగా) తెలిసిన వారు. వీరిని 'ఈ యుగములో ఉండవలసినవారు కాదు. త్రేతాయుగ పురుషులురా బాబు' అనడం కూడా పరిపాటి. లోక కళ్యాణం కోసం ఆత్మ త్యాగానికి కూడా వెనుకాడరు వీరు.

2. కర్మయోగభక్తి : వీరికీ, నిస్వార్థభక్తులకీ ఉన్న సామ్యము - వజ్రానికి, గ్రాఫైట్ కి ఉన్న తేడానే. రూపాంతరమే తప్ప మూలము ఒకటే. వీరు కర్మను సక్రమముగా ఆచరించడము ప్రధానమని అనుకుంటారు. మన కర్తవ్యము మనము ఆచరిస్తే అంతా మంచి జరిగి తీరుతుందని విశ్వసిస్తారు. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుందని నమ్ముతారు. ఎదుటివారికి తెలిసి హాని చెయ్యడము వీరికి తెలియదు. 'అహం బ్రహ్మాస్మి' అనేది వీరూ నమ్ముతారు. ఎవరు చేసిన పనికి ఫలితము వారికే వస్తుంది అనేది వీరి దృఢమైన విశ్వాసము.

3. లౌక్యభక్తి : "దేవా! నేను కోటి రూపాయలు లాభం సంపాదిస్తే, అందులో ఓ ఐదు శాతం నీ హుండీలో వేస్తాన"ని మొక్కుకునే ఈ తరహా వ్యక్తులు, ఓ బిచ్చగాడు ఆకలితో అన్నమని అర్థిస్తే 'ఛీ పో' లతో సరిపుచ్చుకుంటారు. ఈ భక్తి కార్యసాధనకు మాత్రమే. వీరి విగ్రహము నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిష్టిస్తామంటే, నిధులు సమకూర్చడానికి తయారుగా ఉంటారు. సన్మానము చేస్తామంటే దానికి అయ్యే ఖర్చు భరించడానికీ వీరు ముందుంటారు. ఓ ప్రభుత్వ ఆఫీసులో పని చేయించుకోడానికి ఉభయ తారకముగా తృణమో, పణమో చెల్లించుకోవడము మనకందరికి అనుభవమే కదా! అయినా ఈ రోజులలో తృణాన్ని ఎవరు స్వీకరిస్తున్నారు? లల్లూప్రసాద్ లాంటివాళ్ళు తప్ప. తృణము యొక్క గొప్ప'ధనము' అలనాడు బమ్మెర పోతన, నేడు లల్లూ ప్రసాద్ యాదవ్ గుర్తించారు. తక్కినవారు తృణాన్ని తృణీకరిస్తున్నారు. అసలు విషయానికి వస్తే 'ముఖ్యమంత్రిగా ఎన్నుకోబడితే కాలినడకన కొండ ఎక్కుతానని' (దిగేది లేదు సుమా!), 'పదోన్నతి కలిగితే తలనీలాలు సమర్పించుకుంటానని' మొక్కుబడుల వల్ల ప్రయోజనము ఎవరికి? 'తిరిగి పెరిగే' ఖర్చులేని తలనీలాలు దేవునికి, వేలకు వేల కోట్లు వారి జేబుల్లోకి. కొండ ఎక్కేది 'తిరిగి పెరిగే' వళ్ళు తాత్కాలికముగా తగ్గించుకోడానికి, ఆరోగ్యము సంరక్షించుకోడానికి. ఇక ఇక్కడ దేవునికి సమర్పిస్తున్నది ఏమిటి? ఇది ఒక భాగసామ్యవ్యాపారం (Joint Venture) దేవునితో. మనము చేసే నికృష్టమైన పనులకు దేవుని భాగస్వామిని చెయ్యాలనుకోవడం - తప్పు కదూ! పాపం! ఈ విషయాలని గమనిస్తున్న దేవుడు ఏమనుకుంటాడో కదా! బహుశా అన్నదానము, శ్రమదానము, విద్యాదానము, వస్త్రదానము లాంటివి సహృదయముతో చేస్తే ఆనందిస్తాడేమో!

4. స్వార్థభక్తి : వెనుకటికి ఓ భక్తుడు లక్ష్మీదేవి తన ఇల్లు విడిచి వెళ్ళడము గమనించాడట. ఆమెను ఆపి "అమ్మా! ఎందుకు ఈ భక్తుని వదలి వెళ్ళిపోతున్నావ"ని ప్రశ్నిస్తూ "నీవు నా ఇంట్లో కలకాలమూ ఉండమ్మా! నీకు 100 కొబ్బరికాయలు కొడతాను." అని అభ్యర్థించాడట. లక్ష్మీదేవి సరేనంది. రోజులు, వారాలు, నెలలు గడిచాయి. సంవత్సరము దగ్గర పడుతుండగా ఆమె ఆతనిని అడిగిందట "ఏమయ్యా! కొబ్బరికాయలు కొడతానన్నావు. దాని సంగతే మరచిపోయావు. ఇది వరకు నిత్యము చేసే పూజ కూడా ఇప్పుడు చెయ్యడము లేదు" అని. అప్పుడు ఆవ్యక్తి "అమ్మా! కొబ్బరికాయలు కొనాలంటే మళ్ళీ డబ్బు ఖర్చు చెయ్యాలి. అంటే నీవు గుమ్మం దాటుతున్నట్లే లెక్క. అప్పుడు నీవు కలకాలమూ మా ఇంట్లో ఉన్నట్లు ఎలా అవుతుంది?" అన్నాడట. అంటే వీరికి తన పని కావడమే ముఖ్యము, అదీ వీలైనంత చవకగా. వీరు తనపని జరిగేవరకు అవతలివారితో చాలా అణకువగా నున్నట్లు నటిస్తారు. పని జరిగిన పిదప వారిని లెక్కచెయ్యరు. మళ్ళీ వాళ్ళతో పని పడితే గతాన్ని విస్మరించి, వాళ్ళ కాళ్ళు పట్టుకునైనా పని సాధించుకొనడానికి ఉద్యుక్తులవుతారు. వీరు పై వారికంటే ఒక్కవిషయములో గొప్పవారు. అవతలి వారి విషయాలలో తలదూర్చరు. అవతలివారితో పని పడితేనే వారి ముఖము చూసేది.

ఈ నాలుగు రకాలే కాకుండా, వేరే వారు కూడా ఉన్నారు. వీరు వారి ఎదుగుదల కంటే, ఎదుటివారి పతనాన్నే కోరుకుంటారు. వెనుకటికి ఇద్దరు వ్యక్తులు శివునికోసం తపస్సు చేసారు. భోళాశంకరుడు ప్రత్యక్షమై ఏమి కావాలని మొదటి వ్యక్తిని అడుగగా ఆతడు "స్వామీ! ముందుగా ఆ ఎదురుగా నీకై తపస్సు చేస్తున్న భక్తుని కోర్కె నెరవేర్చి, ఆతని కోరికను నాకు తెలియజేయమని, తదుపరి తను కోరుకుందునని" వక్కానింప చంద్రశేఖరుడును అట్లే చేసి, రెండవవానికి ప్రత్యక్షమై "భక్తా ఏమి నీ అభీష్టమని?" యడుగ ఆతండు ఇట్లనియె "స్వామీ! ఎదురుగా నీకై తపస్సుచేస్తున్న ఆతను కోరిన దానికి రెట్టింపు ఫలము నీయుమ"ని అర్థించెను. అప్పుడు పార్వతీ వల్లభుడు మొదటి వ్యక్తి కడకేగి "భక్తా! ఆతడు నీవడిగిన దానికి రెట్టింపు ఫలమర్థించెన"ని తెలుప వెంటనే ఆతండు "అయిన స్వామీ! నా కన్నొకటి గైకొనుమ"ని వరమడిగెను. పన్నగ భూషణుడు "తథాస్తు!" అని అంతర్థానమయ్యెను. అయితే వీరిని ఐదవ తరగతిగా నిర్ణయించలేదు. ఏలనన, నేటి ఈ కలికాలమున పురుషులకు తమ విషయములగురించి ఆలోచించుటకే సమయము సరిపోవుటలేదు. ప్రక్కవానిని పట్టించు కొనుటకు తీరికెక్కడిది? అందులకే ఈ విభజనలో వారిని పరిగణించలేదు.

ఇది వ్యక్తి దూషణకు, ఒకరిని నొప్పించడానికి వ్రాసినది కాదు. దయచేసి ఇందులో మంచిని గ్రహించమని మనవి.